# 'తాను తీసిన గోతిలో...'

**– శ్రీమతి న్యాయపతి కమలారాంజీ**

భవానికి పిచ్చిపట్టినట్టుగా వుంది. తన జీవితం సర్వనాశనం అయిపోయింది. జీవించాలనే ఆశ ఏకోశాన లేదు. అలాగని చచ్చి సాధించేదేమీలేదు. తన సమస్యకి చావు పరిష్కారం కాదు. అసలు ఏ సమస్యకీ చావు పరిష్కారం కాకూడదు. ఎవరికీ చెడు చెయ్యాలని ఎప్పుడూ అనుకోకూడదు. అలా అనుకునేవారికి చేజారిన తన జీవితమే ఒక వుదాహరణ!

శాంత ఏ సమస్యలూ లేకుండా సుఖంగా, సంతోషంగా వుండడం చూసి ఓర్వలేక అభిని అమాయకుడ్నిచేసి ఆట ఆడించాలని అనుకుంది. కాని విధి తనతో వికృతంగా ఆడి తన జీవితాన్నే కబళించివేసింది.

జరిగిన సంఘటనలన్నిటికీ ఒకవిధంగా తనే బాధ్యురాలు! జరిగినదంతా ఒకసారి ఆమె కళ్ల ముందు కదిలింది...

• • •

''హలో ఆంటీ!'' నవ్వుతూ లోపలికి వచ్చేడు అభిషేక్.

''హాయ్ అభిషేక్! నీకోసమే ఎదురుచూస్తున్నాం. రా.. కూర్చో'' భవాని నవ్వుతూ ఎదురొచ్చింది.

''అర్జెంటుగా కాదు''

''అద్సరేగాని ఆంటీ! నన్ను వెంటనే రమ్మని ఫోన్ చేసేరు. ఎందుకు?''

''ఆ! అదా. వూరికినే. నువ్వు మా యింటికి వచ్చి అప్పుడే రెండురోజులయిపోయింది తెలుసా. నువ్వు ఒక్కపూట కనిపించకపోయినా, ఆయనకి, నాకు తోచిచావదోయ్. అయినా మనం వుంటున్నది ఒకే అపార్టుమెంట్‌లో. మాది ఫస్ట్‌ఫ్లోర్. మీది సెకండ్ ఫ్లోర్. రెండడుగులు వేస్తే వస్తుంది మా యిల్లు. ప్రతీరోజూ ఒకసారి వచ్చి వెళ్ళమని చెప్పేనా?! బ్యాంకుపని అయిపోయేక సాయంత్రం ఆరింటికే యింటికి వచ్చేస్తావు కదా. మరి అప్పట్నుంచి యింట్లో కూర్చుని ఏంచేస్తావు? రావచ్చు కదా.''

నవ్వేసేడు అభిషేక్.

''వెళ్తాను ఆంటీ! కొంచెం మార్కెట్ పనివుంది. మమ్మీ ఏవో సరుకులు తెమ్మంది.''

''మార్కెట్ ఎక్కడికీ పారిపోదుగాని కూర్చో. నేను మీ మమ్మీకి చెప్తానులే.'' లేస్తున్న అభిషేక్‌ని బలవంతంగా కూర్చోపెట్టింది భవాని.

''రచనా!''

''ఏంటి ఆంటీ!'' అంటూ లోపల్నుంచి యివతలకు వచ్చింది రచన.

అభిషేక్‌ని చూసి ''హాయ్!'' అంది.

''హలో!'' అనేసి వూరుకున్నాడు అభిషేక్.

''అభిషేక్ కోసం కాఫీ కలిపి పట్రా. స్ట్రాంగ్‌గా, స్పెషల్‌గా వుండాలి. తెలుసా!'' అంది భవాని నవ్వుతూ.

రచన లోపలికి వెళ్లింది. ఆ అమ్మాయి తెల్లగా వుంటుంది. కాని చెప్పుకోదగ్గ అందంలేదు. నుదుటి మీద పడేట్లుగా ఫాషన్‌గా జుట్టు మాత్రం కత్తిరించుకుంది. భవాని వాళ్ల ఎదురు ఫ్లాట్‌లోనే వుంటున్నారు రచనవాళ్లు.

రచనవాళ్ల నాన్న ఏదో ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. రచన ఒక్కర్తే కూతురు.

''కాఫీ బాగుందా? నీకోసం స్పెషల్‌గా కలిపి తెచ్చింది రచన!'' అంది 'నీకోసం' అన్న మాటని వత్తి పలుకుతూ.

''రియల్లీ వండర్‌ఫుల్! ఇలాంటి కాఫీ ఇస్తానంటే రోజూ వచ్చేస్తాను'' అన్నాడు కావాలనే చిలిపిగా.

భవాని ముఖంలోకి వింతకాంతి వచ్చింది. రచనవైపు చూసి నవ్వింది.

రచన ముఖం వేయి వోల్టుల బల్బులా వెలిగిపోయింది.

అభిషేక్ వెళ్లిపోయేడు.

ఆరోజు శుక్రవారం. ప్రతిశుక్రవారం సెల్లార్‌లో అందరూ సమావేశమై లలితా సహస్రనామ స్తోత్రం చదువుతారు. ఆ విషయం గుర్తుకు రాగానే భవాని గబగబా ముఖం కడుక్కుని, తల దువ్వుకుని, చీర మార్చుకుని క్రిందకి వెళ్లిపోయింది.

రచన యింకా వాళ్లింట్లోనే వుంది.

''రచనా! నాకు కాఫీ లేదా?'' అంటూ వంటింట్లోకి వెళ్లేడు ప్రసాదరావు.

''ఆంటీ ఒక్క అభిషేక్ కోసమే కలపమంది. వుండండి మీకోసం కాఫీ కలిపి నిముషంలో తెస్తాను.''

''వద్దులే. వూరికే అన్నాను. నీకెందుకు శ్రమ! నేను కాఫీ కలుపుతాను. చూడు. అదిరిపోతుంది. నువ్వూ ఒక కప్పు తాగాలి మరి. ఒకసారి రుచి చూసేవంటే మరి వదలవు.''

కాఫీ కలిపి కప్పు రచనకిస్తూ నవ్వుతూ అన్నాడు ప్రసాద్.

ప్రసాద్‌కి నలభై అయిదేళ్లుంటాయి. మనిషి తెల్లగా, అందంగా, ధృడంగా, ఆరోగ్యంగా వుంటాడు. రంగు రంగుల టీ షర్టులు వేసినప్పుడు ఇంకా యువకుడిలాగే కనిపిస్తాడు. అతని కళ్లల్లో కొంటెతనం... మాటల్లో చిలిపితనం... చూపుల్లో వింత ఆకర్షణ!

ప్రసాద్, భవానిలది ప్రేమవివాహం. పెళ్లయి పదేళ్లయింది. కాని యింకా పిల్లలులేరు.

బాల్కనీలో నించుని ప్రసాద్ చెప్పే మాటలు వింటూ, నవ్వుతూ అలా ఉండిపోయింది రచన.

బాగా చీకటిపడిపోయింది. రాత్రిపూట చుట్టూ వెలుగుతున్న విద్యుద్దీపాల వింతకాంతుల మధ్య విశాఖపట్నం అత్యంత సుందరంగా కనిపిస్తోంది.

''రచనా! నువ్వింకా యిక్కడేవున్నావా?'' అంటూ లోపలికి వచ్చింది భవాని.

''అరె. అప్పుడే వచ్చేసేరా! అంకుల్‌తో మాట్లాడుతూ వుంటే టైమ్ తెలియలేదు ఆంటీ.'' నవ్వేసి తన ఫ్లాట్‌కి వెళ్లిపోయింది రచన.

పెళ్లికాకముందు భవాని, ప్రసాద్‌లవి పక్కపక్కయిళ్లే అవడంనించి రోజూ భవాని, వాళ్ళింటికి వస్తువుండేది. అప్పుడప్పుడు వాళ్లిద్దరు వుడా పార్కులో, బీచ్‌లో గంటలతరబడి కబుర్లు చెప్పుకునేవారు. ప్రసాద్ తల్లిదండ్రులకు భవానిని కోడలిగా చేసుకోవడం ఇష్టంలేదు. కాని వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు. కాబట్టి పెద్దవాళ్లకి చెయ్యకతప్పలేదు. పెళ్లయిన తర్వాత కొన్నాళ్లు ప్రసాద్, బంధువుల సూటిపోటి మాటలతో, తల్లిదండ్రుల విముఖతతో చాలా సమస్యలు ఎదుర్కొన్నాడు. అయినా వాళ్లిద్దరూ మొండిగా వేటినీ లక్ష్యపెట్టడం మానేసేరు. పెళ్లయ్యాక భవాని తను చేస్తున్న టీచర్ జాబ్‌ని కొన్నాళ్లు కంటిన్యూచేసి తర్వాత ఎందుకోమరి మానేసింది.

భవాని చీర మార్చుకుని గబగబా వంటచేసింది. ఇద్దరూ భోజనాలు ముగించేరు. బాల్కనీలో కూర్చున్నారు. ఇద్దరి మధ్యా మవునం రాజ్యమేలుతోంది.

వెన్నెల చల్లగావుంది. వాతావరణం ఆహ్లాదకంగా వుంది. నీలాకాశంలో అందమైన చందమామ వింత వింత విన్యాసాలు చేస్తున్నాడు. ఒకసారి మబ్బులచాటున దాక్కుని కనబడకుండా ''పట్టుకోచూద్దాం'' అన్నట్టు తప్పించుకుంటున్నాడు. మరొకసారి మబ్బుల్ని ఛేదించుకుని ఇవతలకు వచ్చి అల్లరిగా నవ్వుతున్నాడు. ఇంకొకసారి కొబ్బరి ఆకుల సందులోనించి తొంగి చూస్తున్నాడు.

అంత చక్కటి వాతావరణంలో కూడా వారిద్దరి మధ్యా మాటలు దొర్లడంలేదు. ఎవరిమటుకు వారే ఆలోచనల్లో మునిగిపోయివున్నారు. పిల్లలు కలగకపోవడానికి తన భర్తే కారణం అనుకుంటుంది భవాని. భార్యలోనే లోపం వుందని ప్రసాద్ అనుకుంటున్నాడు. కాని ఇద్దరూ డాక్టరు దగ్గరకెళ్లడానికి ధైర్యం చెయ్యలేకపోతున్నారు.

• • •

''అభీ! ఎక్కడికిరా?'' శాంత అడిగింది.

''భవానీ ఆంటీవాళ్ల యింటికమ్మా'' చెప్పులేసుకుంటున్న అభిషేక్ చెప్పేడు.

''రోజూ పొద్దున్న-సాయంత్రం వాళ్లింటికి అటెండెన్స్ వేసుకుంటున్నట్టుగా వెళుతున్నావు. నీకూ-వాళ్లకి ఏమి ఉంటాయిరా అన్ని కబుర్లు?'' ఆశ్చర్యంగా అడిగింది శాంత.

''అమ్మా! నీకన్నీ సందేహాలే. ఎవరింటికీ వెళ్లకుండా యింట్లోనే కూర్చోమంటావా! అయినా వెళ్తే తప్పేంటి? మన అపార్టుమెంటేకదా. మన కిందఫ్లోర్‌లోనే వుంటున్నారు. ఆంటీ యిందాక ఫోన్ చేసింది వెంటనే రమ్మని. ఎందుకో కనుక్కుని వచ్చేస్తాను.''

శాంత యింకా ఏదో అనేలోగానే అభిషేక్ బయటకు నడిచేడు.

శాంత ఆలోచనలు పరిపరి విధాలపోతున్నాయి....

పెళ్లయి అత్తవారింటికి పంపించేదాకా ఆడపిల్లని కంటికి రెప్పలా కాపాడుకోవాలని అంటారు. కాని ఈరోజుల్లో పెళ్లీడు వచ్చిన మగపిల్లాడ్ని కూడా అంత కంటే ఎక్కువ శ్రద్ధగా, జాగ్రత్తగా గమనిస్తూ ఎవరూ ట్రాప్ చెయ్యకుండా వుండేవిధంగా తగిన బందోబస్తు చెయ్యాల్సిన బాధ్యత తల్లిదండ్రులకుందని శాంతకి బాగా తెలుసు. అందుకే అభిషేక్ గురించి అంతలా ఆలోచిస్తున్నది.

వీడు రోజూ రెండుపూటలా భవాని వాళ్లింటికి వెళ్లి ఏం చేస్తున్నాడు? ఆవిడతో వీడికి ఏం కబుర్లు వుంటాయి? ప్రసాద్ వున్నాడు కదా. ఆయన చాలా సరదామనిషి. అతనితో మాట్లాడుతూవుంటే గంటలు నిమిషాల్లా గడచిపోతాయి. అంత చక్కగా ఎంటర్‌టెయిన్ చెయ్యగలడు అతను! అందుకేనేమో అభి ఎప్పుడూ వాళ్లింట్లోనే వుంటున్నాడు. ఏమో!... ఆ ఆలోచన పూర్తిగా నిజం అనుకుందికి ఆమె మనసు ఎందుకో ఒప్పుకోవడంలేదు?! ఆరా తీయాలి. తన మనసులో పుట్టిన అనుమానం ఎవరికీ తెలియనివిధంగా, ఎవరికీ అనుమానం కలగకుండా తను ఆరాతీయాలి.

ఈమధ్య భవానీవాళ్లు గిరిజ, చలపతివాళ్ల ఫామిలీతో చాలా క్లోజ్‌గా వుంటున్నారు. వాళ్లమ్మాయి రచన అయితే అస్తమానం భవాని వాళ్లింట్లోనే. కొంపతీసి ఆ అమ్మాయిని....! ఆమె గుండెలో రాయి పడినట్టయింది. పిచ్చి ఆలోచనలతో ఆమె బుర్రంతా చెత్తబుట్టలా తయారయింది. వీళ్ల బాల్కనీలో నించుని తొంగిచూస్తే భవాని వాళ్ల బాల్కనీలో ఎవరున్నది బాగా కనిపిస్తుంది. ఎన్నోసార్లు రచనని వాళ్లింట్లో తనే స్వయంగా చూసింది శాంత. అందుకే ఆమెకి అలాంటి అనుమానం కలిగింది. ఏదిఏమైనా తను ఎక్కడా బయటపడకూడదు. తనకు సంస్కారంవుంది. కన్నతల్లిగా తను అభికి ఆపాటి సంస్కారం నేర్పింది. తన బాధ్యతలు, తన కర్తవ్యం, యింటి పరువు- ప్రతిష్ఠలని కాపాడవల్సిన తీరు, నలుగురితో ఎలా మాట్లాడాలి, ఎదటివారి మనసు నొప్పించకుండా ఎలా ప్రవర్తించాలి... యిలాంటివన్నీ సమయం దొరికినప్పుడల్లా అభికి నూరిపోస్తూనే వుంటుంది శాంత. తన




## పందెం!

మహారాష్ట్రలోని పోలీసు డ్రైవర్ వీర్ బల్, అతని స్నేహితుడు కానిస్టేబుల్ కమలేశ్వర్‌లు ఆమధ్య ఓ పందెం వేసుకున్నారు. ఓ చిన్న పందెం అనుకోన్నది చివరికి వారిపట్ల అది ఓ పెద్ద పందెంగా మారింది. ఆరోజున దలైలామా తన పర్యటనలో భాగంగా రామ్‌గర్ వచ్చారు. పోలీసు లైన్లో ఆయనకారు ఉంచబడింది. ఆకారు బుల్లెట్ ప్రూఫ్ అని ఒకరు, కాదని మరొకరు వాదన వేసుకొని చివరికి పోలీసులిద్దరూ పందెం కాసుకున్నారు. బులెట్‌ప్రూఫ్ అయినదీ లేనిదీ తేల్చుకోవడానికి వాళ్లు కారుపై రాళ్ళు విసిరిచూశారు. విండ్‌స్క్రీన్ బద్దలయింది. భయపడి ఆ ప్రదేశం నుంచి పారిపోయారు. దలైలామా విషయంలో తాము చేసిన తప్పు పనికి వాళ్లు బాధపడి, తమ పై అధికారికి జరిగిన సంగతి చెప్పారు. వెంటనే విండ్‌స్క్రీన్ వేయించమని అధికారి ఆర్డరు వేశాడు. అంతేకాక వాళ్ల యాన్యువల్ ఇంక్రిమెంట్‌ను నిలిపివేశాడు.

## బతికున్నవాళ్లు!

వారంతా 58 మంది. లక్నోలో గవర్నర్‌ను కలవడానికి వెళ్లారు. చిత్రమేమిటంటే, బతికున్నవాళ్లనందర్నీ చనిపోయిన వారిగా రికార్డ్సులో ఆఫీసర్లు చూపారు. బంధువుల దృష్టిలో వారు చనిపోయినవారే! వారి ఆస్తులను కాజెయ్యడానికి బంధువులు దొంగ విల్లులు సృష్టించి డెత్ సర్టిఫికేట్‌లు కూడా సంపాదించారు. తాము బతికే ఉన్నామనీ, తమను ఇక్కట్లకు గురిచేసిన బంధువులను, ఉద్యోగులను శిక్షించి, తమ ఆస్తులను తమకు ఒప్పగించవలసినదిగా వారంతా గవర్నర్‌ను కోరారు. అందుకు ఆయన స్పందించి, వారికి న్యాయం జరిగేలా చూస్తానని వాగ్దానం చేశాడు.

\- కొడిమెల




సందేహాలన్నీ అభినే నెమ్మదిగా అడిగి తెల్సుకోవాలి. తన నేర్పంతా ఆ అడగడంలో చూపించాలి. మొదటే గట్టిగా దండించినట్టుగా మాట్లాడితే మొదటికే మోసం వస్తుంది. "నా యిష్టం. నా యిష్టం వచ్చినట్టు నేను చేస్తాను. మీరెవరు మధ్య" అని వాడిచేత అనిపించుకునే దౌర్భాగ్యం తనకు కలగకుండా వ్యవహరించాలి. అభి అలాంటివాడు కాడని తన మనసు గట్టిగా చెప్తోంది. అయినా ఏమిటో.. ఎందుకో పిచ్చి అనుమానాలు...

గంటన్నర తర్వాత అభి తిరిగి వచ్చేడు.

"అయేయా ఆంటీతో కబుర్లు! ఏంటి విశేషాలు?" భోజనం వడ్డిస్తూనే నవ్వుతూ అడిగింది శాంత.

"కబుర్లు.. అంటే.. ప్రత్యేకంగా ఏవీ లేవమ్మా! ఏదో సొల్లు బాతాఖానీ."

"కార్డ్సు ఆడేవా?"

"లేదు. కార్డ్సు ఆడలేదు. కాని హౌసీ ఆడేం. నాకు యిర్వై అయిదు రూపాయలొచ్చేయి."

"బాగుందిరా. కాని హౌసీ అంటే మరీ ముగ్గురితో అవదుకదా. ఇంకా ఎవరున్నారు?"

"రచన, వాళ్ల మమ్మీ, వాళ్ల డాడీ, భవానీ ఆంటీ, అంకుల్, నేను, మరో ఇద్దరు ఎవరో... ఏం అలా అడుగుతున్నావు?"

"అహ! ఏంలేదు. వూరికినే అడిగేను. ఇంకొంచెం కూర వేసుకో అభీ." భోజనం వడ్డిస్తూ అంది.

"అవునూ, వీధిలోకి క్వాలిటీ ఐస్‌క్రీం వచ్చింది. నువ్వు కొన్నట్టున్నావు కదా." యధాలాపంగా అడిగినట్టుగా అడిగింది. తన అనుమానంలో ఎంత బలం వుందో తెల్సుకుందామని.

"ఆ! టెండూల్కర్ సెంచరీ కొడతాడని నేను, కొట్టడని వాళ్లు బెట్ కట్టేం. ఓడిపోతే అందరికీ ఐస్‌క్రీం ఇవ్వాలిట. నాకు మరి యివ్వకతప్పలేదు."

"ఈ బెట్‌లేంట్రా అనవసరంగా."

"ఇంకదేనికో యిలాగే ఆంటీ నాతో బెట్ కట్టింది. నేను ఓడిపోతే రచనని సినిమాకి తీసుకెళ్లాలట!"

"ఏమయింది? గెలిచావా?"

"లేదు."

"మరి రచనని సినిమాకి తీసుకెళ్లేవా?" భవానిమీద పీకలదాకా కోపం వచ్చేస్తున్నా పైకి ప్రశాంతంగా నవ్వుతూనే వుంది.

"ఛ, దాన్ని తీసుకుని సినిమాకి వెళ్లడమా! నేనెలా కనిపిస్తున్నాను నీకు" అన్నాడు వుక్రోషంగా.

'హమ్మయ్య..' అనుకుంది మనసులోనే. "అభీ. ఆ రచన ఏం చదువుతోందిరా?"

"అది, బి.ఏ. చెక్కేసింది. మళ్లీ మళ్లీ కడుతోంది."

"అదేంట్రా బి.ఎ. పోవడం ఏంటి? అంటే ఆపిల్లకి బుర్రలో మసాలా ఏమీ లేదన్న మాట."

అభి పకపకా నవ్వేడు ఆ మాటలకి...

• • •

శాంతకి ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. ఏదో భయం! భవాని ప్లాన్ తెలుస్తూనేవుంది. ఆ గిరిజ సంగతి కూడా తనకి బాగా తెల్సు. అతిగా అలంకరించుకోవడం, పని మనుషులతో, పాలవాళ్లతో, చాకలివాళ్లతో, కూరగాయలవాళ్లతో... అందరితో గొడవ పెట్టుకోవడం, బిగ్గరగా అరవడం. అవన్నీ తనకి మహా ఎలర్జీ. చాలా చీప్ మెంటాలిటీ ఆవిడది! ఆవిడ్ని తల్చుకుంటేనే తనకు కంపరం పుడుతుంది. ఆ రచన కూడా అంతే. కనిపించిన ప్రతీ మగపిల్లాడితోనూ రాసుకు పూసుకు తిరుగుతుంది.

అభి వయసులో వున్నాడు. పైగా బ్యాంకు ఆఫీసరు. హేండ్‌సమ్‌గా వుంటాడు. ఇంకా పెళ్లికాలేదు. బాధ్యతలు ఏవీలేవు వాడికి. ఈ ప్లస్ పాయింట్సన్నీ ఏ ఆడపిల్ల తల్లిదండ్రుల్నయినా ఇట్టే ఆకర్షిస్తాయి. అందుకేనేమో అభిని తమవైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. ఇందులో భవాని హేండ్ పూర్తిగా వుందనడానికి ఎటువంటి సందేహమూ లేదు.

పెద్దలనెదిరించి పెళ్లి చేసుకుని తర్వాత భర్తని తనవైపుకు తిప్పుకుని అత్తవారి వైపువాళ్లని ఎవర్నీ యింటికి రానివ్వకుండా చేసిన మహా యిల్లాలు ఆ భవాని! గొప్ప వాగుడుగాయి. అందుకే భవానికి.. గిరిజకి బాగా పొత్తు కుదిరింది. కాని శాంత అలాక్కాదు. ఒక్క నిముషం కూడా టైం వేస్టుచెయ్యదు. టైమ్ ఈజ్ మనీ ఆమెకి. భవాని, గిరిజ వాళ్లు యింట్లో స్టౌమీద పాలు పొంగిపోతున్నా, కూర మాడిపోతున్నా అలా గుమ్మంలో నిల్చుని వాళ్లమీదా, వీళ్లమీదా చెప్పుకుంటూనే వుంటారు. శాంతని కూడా రమ్మని భవాని ఎన్నోసార్లు అంది. కాని యింటి పన్లు వదిలేసి సొల్లు కబుర్లు చెప్పుకుంటూ కూర్చోవడం శాంతకి అసలిష్టం వుండదు. తన యిల్లు, సంసారం, భర్త, పిల్లలు, తన పని.. అంతేకాని సాధారణంగా ఎవరిళ్లకి వెళ్లదు. అందుకేనేమో భవానికి శాంత అంటే కడుపుమంట. మనసులో ఎక్కడో అసూయ, కోపం లాంటివి వున్నాయి.

అభి, వాళ్లింటికి ఏరోజైనా వెళ్లకపోతే ఫోన్ల మీద ఫోన్లు చేసేడం, విపరీతమైన అభిమానం ఒలకబోయడం, వీడు వెళ్లినప్పుడు రచన కూడా ఎప్పుడూ అక్కడే వుండడం, ఇవన్నీ భవాని ఇంటెన్షనల్‌గా చేస్తోంది... ఈ వ్యవహారమంతా చాలా చిరాగ్గావుంది శాంతకి.

ఆరోజు రాత్రి శాంత తన అనుమానాలన్నీ భర్తతో చెప్పింది. ఆయనకి తన కర్తవ్యం గుర్తుచేసింది. ఇద్దరూ కల్సి బాగా ఆలోచించేరు.

"శాంతా! నువ్వు వూరికే అనవసరంగా భయపడుతున్నావు. మన అబ్బాయి అలాంటివాడు కాదు. వాడి గురించి నాకు బాగా తెలుసు." అన్నాడు సీతాపతి.

"నిజమే అయివుంటుంది. కాని మనం ముందుగానే కళ్లు తెరవడం మంచిదని నా అభిప్రాయం. మనవాడు బుద్ధిమంతుడే. కాదనలేదు. కాని వాళ్లంతా కల్సి ఏదో ప్లాన్‌వేసి ఆ అమ్మాయిని, వీడ్ని కలిపి ఫోటోలుతీసి

వాటిని అడ్డంపెట్టుకుని అభిని బ్లాక్‌మెయిల్ చేసి పెళ్లికి ఒప్పించవచ్చుకదా.''

''శాంతా! నీ ఆలోచనలు ఎక్కడికో వెళ్లిపోతున్నాయి. వద్దు. నీ బుర్ర పాడుచేసుకోకు. మనం నెమ్మదిగా అభికి నచ్చజెప్దాం. సరేనా. పడుకో.''

మర్నాడు సీతాపతి ఆఫీసు నుండి తొందరగా యింటి కొచ్చేసేడు. రాగానే ''అభీ! మనం చెస్ ఆడదాం. ఎవరు ఓడిపోతే వాళ్లు ఫైవ్‌హండ్రడ్ ఇచ్చుకోవాలి. తెలిసిందా.''

''వెరీ ఇంటరెస్టింగ్! ఓకే. నేను రెడీ'' వుత్సాహంగా ఒప్పుకున్నాడు అభిషేక్.

సీతాపతి కావాలని ఓడి అయిదువందలు ఇచ్చుకున్నాడు కొడుక్కి.

ప్రతీరోజూ ఏదో ఒకటి ఆడుతున్నారు తండ్రీ కొడుకులు.

శాంత కూడా తొందరగా వంటచేసేసి వాళ్ల ఆటతో కలుస్తోంది. చెస్, క్యారమ్స్, కార్డ్స్ ఇలా రోజూ ఏదో ఒకటి. ఏదీ లేకపోతే ఏ బీచ్‌కో, కైలాసగిరికో వెళ్తున్నారు.

ఒకరోజు ఇద్దరూ కొడుకు దగ్గర కూర్చుని తమ భయాలు, ఆందోళనలు, అనుమానాలు అన్నీ ఏకరువు పెట్టేరు.

''మనది చాలా పరువైన కుటుంబం. హిందూ సంప్రదాయాన్ని గౌరవించే వంశం మనది. కులాంతర, మతాంతర, శాఖాంతర వివాహాలు చాలామంది చేసుకుంటున్నారు. కాదనలేదు. కాని మన యింట్లో అలాంటివి జరగడం మాకెంతమాత్రం ఇష్టంలేదు. ఇవాళ నువ్వు తొందరపడి ఏ నిర్ణయమైనా తీసుకుంటే అది నీ జీవితాన్నే నరకం చేస్తుందేమోనని మా భయం.''

ఈ ఉద్వేగాతమంతా దేనికో అర్థంకాలేదు అభిషేక్‌కి.

''అసలు మీ భయం ఏమిటి?''

కారణం- అతని మనసులో నిజానికి రచనపట్ల అలాంటి ఆలోచనలే లేవు.

''ఏం లేదు కన్నా! నిన్ను కష్టపడి పెంచి పెద్దచేసేం. బాగా చదివించేం. ఇంతవాడ్ని చేసేం. ఇప్పుడు నువ్వు మంచి వుద్యోగంలో వున్నావు. అందుకే ఎవరైనా నిన్ను ట్రాప్ చేస్తారేమోనని.. అమ్మకి- నాకూ భయం..'' అభి ముఖంలోకి చూస్తూ అన్నాడు సీతాపతి.

''అదా మీ భయం! ఛ! అసలు మీరు నాగురించి అలాంటి భయాలేవీ పెట్టుకోకండి! మీరు ఏ అమ్మాయిని చేసుకోమంటే ఆ అమ్మాయినే చేసుకుంటాను'' అన్నాడు అభిషేక్ నవ్వుతూ.

అప్పటికి వాళ్లిద్దరి మనసులు కొంచెం స్థిమితపడ్డాయి.

''నీకు మంచి సంబంధం చూసి పెళ్లిచేస్తాం అభి! నా టేస్టులు నీకు తెల్సు. నీ టేస్టులు నాకు తెల్సు. అన్నివిధాల నీకు తగిన అమ్మాయిని చూస్తాను. నీకు పూర్తిగా నచ్చితేనే ఆ అమ్మాయినిచ్చి చేస్తాం. చక్కటి చదువు-సంస్కారంతోపాటు అందం, తెలివితేటలు గల అమ్మాయికోసం చూస్తున్నాను. నువ్వు జీవితంలో ఎప్పుడూ కూడా బాధపడే అవసరంగాని, అవకాశంగాని రాకుండా చక్కటి జీవితం గడపాలన్నదే మా ఇద్దరి కోరిక. నాన్నకి, నాకు, ప్రేమ వివాహాల మీద సదభిప్రాయం లేదురా.

మీ నాన్న నన్ను పెళ్లిచేసుకోకముందు నేనెవరో ఆయనకి తెలీదు. వాళ్ల తల్లిదండ్రులు తెచ్చిన సంబంధమే చేసుకున్నారు. నన్ను చేసుకున్న తర్వాత మేమిద్దరం ఎంత అన్యోన్యంగా, హాయిగా, సుఖంగా వున్నామో నువ్వు చూస్తూనేవున్నావుకదా. నువ్వు కూడా ఎప్పుడూ సుఖంగా వుండాలనేదే మా ఆశ, ఆకాంక్ష. అర్థం చేసుకో అభీ'' కళ్ళంట నీళ్లు వచ్చేయి శాంతకి.

''అమ్మా!'' తల్లి కళ్లల్లో నీళ్లు చూసి గొంతు పూడుకుపోయింది అభిషేక్‌కి.

''అమ్మా! నన్ను నమ్మండి. మీకిష్టంలేనిపని, మన యింటి పరువు పోయేపని నేను ఎప్పటికీ చెయ్యను. సరేనా!''

''నువ్వు బంగారుకొండవిరా. నాకు తెల్సు. కాని మన చుట్టూవున్నవాళ్లే... ఎందుకైనా మంచిది... నువ్వు భవాని వాళ్లింటికి వెళ్లడం తగ్గించరా.'' శాంత అంది.

''వాళ్లింటికి ఎందుకు వెళ్లొద్దంటున్నావు?'' మళ్లీ అర్థంకాలేదు అభికి.

''ఆ రచన... రోజూ నువ్వు వెళ్లిన టైంలోనే రావడం... నీకోసం ఎదురుచూడ్డం... ఆ కబుర్లు... బెట్టులు.. నాకేదో అనుమానంగా వుంది! అందుకే మన జాగ్రత్తలో మనం వుండడం మంచిదికదా అభి.''

నవ్వేసేడు అభిషేక్. ''అదా నీ భయం! ముందే చెప్పొచ్చుకదా ఆ విషయం. ఈడొంక తిరుగుడంతా దేనికి. నువ్వు అన్నావు కాబట్టి చెప్తున్నాను అసలా పిల్ల మీద నాకు అలాంటి అభిప్రాయం లేనేలేదు. ఎప్పటికీ కలగదు. నువ్వు వాళ్లింటికి వెళ్లొద్దన్నావు. ఓ.కె. నేను మానేస్తాను. ఆంటీ ఎప్పుడైనా ఫోన్ చేస్తే నేను యింట్లో లేనని చెప్పెయ్యి. సరేనా!''

శాంత మనసు దూదిపింజెలా తేలిపోయింది. మబ్బులు తొలగిన ఆకాశంలా వుంది. తమ కొడుకు మీద పూర్తి నమ్మకం కలిగింది వాళ్లిద్దరికీ.

ఇప్పుడు నిజంగానే అభిషేక్ భవాని వాళ్లింటికి వెళ్లడం మానేసేడు.

సడన్‌గా వెళ్లడం మానీగానే వాళ్లకి ఏమీ తోచినట్టు లేదు. ఒకరోజు తుఫానులా భవాని సరాసరి శాంత వాళ్లింటి వంటింట్లోకి వచ్చేసింది.

''శాంతగారూ! మీవాడు చేసిన పని ఏమీ బాగులేదు'' అంది వస్తూనే. వంటపనిలో మునిగివున్న శాంత వులిక్కిపడింది ఆమాటలకి.

''ఏమైంది?'' అంది లోపల భయపడుతూనే.

''ఏమైందా? మీవాడు మాయింటి వైపుకే రావడం మానేసేడు. ఇదివరకు ఎన్ని పన్లున్నా మా యింటికి రాకుండా వుండేవాడు కాదు. కాని ఇప్పుడు అదేమిటో అసలు కనిపించడమే మానేసేడు. ఏమయింది? వంట్లో బాగులేదా? మేమందరం అభి

## పండగ సరదాలు

ఇటీవల పండుగల గురించి అడగ్గా తారలు చెప్పిన కొన్ని కబుర్లు.



★ నాకు దీపావళి అంటే భలే సరదా. చిన్నపిల్లగా మారి పోయి టపాసులు కాల్చడం సరదాగా ఉంటుంది.

- మీనా

★ కృష్ణుడంటే నాకెంత ఇష్టమో, అతని ప్రేమ ఓ కావ్యం. కృష్ణాష్టమి అంటే నాకిష్టం.

- మధుబాల

★ సరదా, సరదాగా జరుపుకునే దసరా అంటే నాకిష్టం. కొత్తబట్టలు, పిండివంటలు.. అబ్బో.. యమహుషారు.

- రేవతి

★ పండుగలు మొదలయ్యేది శ్రావణమాసంలో. ఈ మాసంలో వచ్చే వరలక్ష్మీవ్రతం అంటే ఎంతో ఇష్టం, కొత్తచీర, శనగల వాయినాలు, పసుపుబొట్లు, వ్రతాలు.. పేరంటాలు.. శ్రావణమాసమంతా బిజీ, టి.వి. సీరియల్స్ కూడా ఆ టైమ్‌లో పట్టించుకోను.

- కె.ఆర్.విజయ

★ కొత్తపంట చేతికొచ్చి, వరిపైరు ఏపుకొచ్చి, ఊరంతా గొబ్బెమ్మలతో ఆహ్లాదంగా ఉండే సంక్రాంతి అంటే నాకు బలే ఇష్టం. కొత్తబట్టలు, పిండివంటలు, భోగిపండ్లు, కొత్తనగలు... ఆహా! పండగే పండుగ.

- రమ్యకృష్ణ





## కాలర్

''చొక్కాకు కాలర్ కుట్టద్దు''

''అదేంటి సార్. అలవాటు లేదా?''

అడిగాడు టైలర్.

''అదికాదోయ్! అప్పులవాళ్ళు కాలర్ పుచ్చుకుని అడుగుతారని..!'' నసిగాడు నానారావ్.

- పి.వి.రమణకుమార్ (చిలకలూరిపేట)

## ఆలస్యం

''పెళ్ళయిన తర్వాత రోజూ ఆలస్యంగా ఆఫీసుకి వస్తున్నావ్?'' గద్దించాడు ఆఫీసర్.

''ఇంతకుముందు నాబట్టలు నేనే ఉతుక్కునేవాణ్ని. నాపనులు నేనే చేసుకునేవాణ్ని. ఇప్పుడు ఇద్దరి పనులు చేసి రావటం ఆలస్యమైపోతుంది సార్'' బాధగా చెప్పాడు.

- గుబ్బల శ్రీనివాస్ (బాంబే)

## మంచిరోజులు

''పెళ్ళిచూపుల్లో నిన్ను సెలక్ట్ చేసుకోంగానే, నీకేమనిపించింది'' ప్రేమగా అడిగాడు శ్రీకర్.

''నీకు నోరెక్కువ, గయ్యాళివి.. నీకు పెళ్ళవుతుందా?' అన్నవాళ్ళ నోళ్ళు మూతపడ్డందుకు.. నాకూ మంచిరోజులొచ్చాయనిపించింది!'' కళ్ళు తిప్పుతూ చెప్పింది శ్రీవాణి.


- ప్రతాప వెంకట సుబ్బారాయుడు (జె.జె.నగర్)

## బుద్ధి

''పక్కింటి సుబ్బారావుగారిని చూసి బుద్ధి తెచ్చుకోండి'' తాగుబోతు భర్తని కసురుకుంది భార్య.

''ఆ సుబ్బారావు బుద్ధెక్కడ తెచ్చుకున్నాడో అడ్రస్ ఇవ్వమను. నేనూ వెళ్ళి తెచ్చుకుంటాను'' మత్తుగా అన్నాడు భర్త.

- శ్రీపాద శ్రీనివాస్ (బొబ్బిలి)




కోసం ఎంత బెంగపెట్టుకుంటున్నామో మీకేం తెలుసు. రచన అయితే మరీను.''

వళ్లు మండిపోతోంది శాంతకి. ఎంత నటన! ఎంత నయవంచన! ఇన్నాళ్లు లేని ప్రేమ, అభిమానం యింత హఠాత్తుగా ఎందుకు పుట్టుకొచ్చేయో?!

భవానిమీద పీకలదాకా కోపం వచ్చేస్తున్నా ఏమాత్రం ఎక్స్ప్రెజ్ అవకుండా నవ్వుతూ అంది.

''బ్యాంకులో కాస్త పని ఎక్కువైందండీ. అసలు రావడమే రోజూ రాత్రి తొమ్మిదింటికి వస్తున్నాడు. వస్తూనే బట్టలు మార్చుకుని భోంచేసి పడుకుంటున్నాడు.''

''అలాచెప్పండి. అదీసంగతి. లేకపోతే నన్ను చూడకుండా, నాతో మాట్లాడకుండా అసలు ఒక్కరోజైనా వుండలేడు అభి. బ్యాంకు నుండి వస్తే ఒకసారి ఎలాగైనా వీలుచూసుకుని ఆంటీ రమ్మందని చెప్పండి. వస్తాను.''

''అలాగే. తప్పకుండా చెప్తాను'' అంది శాంత.

కాని తర్వాత భవాని వచ్చినట్టు కూడా చెప్పలేదు అభికి. తెలివి ఆవిడొక్కర్తికే వున్నాదనుకుంటుంది. ఆవిడలేకపోతే సృష్టే లేదన్నట్టు మాట్లాడుతుంది. శాంతకి నవ్వొచ్చింది భవానిని చూస్తుంటే...

● ● ●

మరో రెండునెలల్లోనే ఎమ్.ఎస్.సి. మేథమెటిక్స్ ఫస్ట్ క్లాస్‌లో పాసయిన జయంతినిచ్చి అభిషేక్‌పెళ్లి అయిపోయింది. శాంత, సీతాపతిలు హాయిగా వూపిరిపీల్చుకున్నారు. పెళ్లయిన దగ్గర్నుంచి అభిషేక్ పూర్తిగా బిజీ అయిపోయేడు. పెళ్లవగానే పెళ్లాంతో హనీమూన్, తర్వాత పెళ్లాంతో సినిమాలు, షికార్లు... క్షణం కూడా తీరిక వుండడంలేదు అభికి.

● ● ●

మూడు నెలలు చాలా తొందరగా గడిచిపోయాయి. ఒకరోజు పిడుగులాంటి వార్త మోసుకొచ్చేడు అభిషేక్. ఆవార్త విని అచేతనంగా, షాక్ తిన్నదానిలా అలా వుండిపోయింది శాంత.

''అదేమిటి? ఎలా జరిగింది?'' పదే పదే అనుకోసాగింది.

''అమ్మా! ఎవరికీ చెప్పనంటే నీకో విషయం చెప్తాను'' మెల్లగా అన్నాడు అభిషేక్.

''నేనెవరికి చెప్తానురా?! చెప్పు. అసలేం జరిగిందో?!'' ఆతృతగా అడిగింది శాంత.

''రచనకి... రచనకి ఆ పరిస్థితి ఏర్పడ్డానిక్కారణం.. ప్రసాద్ అంకల్‌ట!''

''ఆ!?'' నమ్మలేకపోతోంది శాంత.

''పెళ్లయి పదేళ్లయినా.. వాళ్లకి ఇంకా పిల్లలు లేకపోవడానిక్కారణం... ఆ ప్రసాద్.''

''కాదమ్మా! భవానీ ఆంటీకి ఏదో యుటరస్ ప్రాబ్లం వుందట. ఆవిడకి మరి పిల్లలు పుట్టరని తెల్సింది. కాని ఆ విషయం తెలియని ప్రసాద్ తను మగాడినని నిరూపించుకుందికి రచనతో.. ఎఫైర్ పెట్టుకున్నాడట! ఆమెకి ఇప్పుడు థర్డ్ మంత్‌ట. ఆవిషయం తెల్సినదగ్గర నుంచీ ఇద్దరిళ్లకీ మధ్య పచ్చగడ్డి వస్తే భగ్గుమంటోంది.''

ఆంటీ వాళ్లింట్లో రోజూ గొడవలే. ఆంటీ ఏడ్చి, మొత్తుకుని ఆయనకి విడాకులు ఇచ్చేస్తానని గొడవ పెట్టేస్తోంది. ప్రసాద్ అంకుల్ మాత్రం సమస్య తనది కాదు అన్నట్టుగా హాయిగా తిరుగుతున్నారు.''

''చూసేవా అభీ! ఈ ప్రేమ వివాహాలు! 'నువ్వు లేకపోతే నేను బ్రతకలేను' అని అంతలా పట్టుబట్టి పెళ్లి చేసుకున్న వాళ్లు ఈరోజు ఎలా విడిపోవాలని అనుకుంటున్నారో?! ప్రేమ వివాహాలు చాలావరకు నిలువడంలేదురా. ఏదోవిధంగా ఫెయిల్ అయిపోతున్నాయి. ఇంతకీ రచన ఏమంటోంది?''

''అమ్మా! తమాషా అయిన విషయం ఏమిటంటే, రచన.. ప్రసాద్‌గారినే పెళ్లి చేసుకుంటానని కూర్చుందట. ఆయన్ని తప్ప మరెవర్నీ పెళ్లి చేసుకోనని, ఆయన్నిచ్చి పెళ్లి చెయ్యకపోతే ఏకంగా చచ్చిపోతానని బెదిరిస్తోందట యింట్లో.'' అభి అన్నాడు.

''బాగుందిరా, చాలా బాగుంది.''

శాంతకి పాపం భవానిమీద ఎందుకనో జాలివేసింది.

ఓదార్చడానికి వెళ్లినా, కస్సుమని ఒంటికాలిమీద లేస్తుందేమోనని భయం వేసింది.

రచనని... అభికి అంటగట్టేద్దామని, అభిని అతని తల్లిదండ్రులక్కాకుండా చేద్దామని ప్లాన్‌వేసి అభిని అభిమానం అనే కవరింగ్ ఇస్తూ రోజూ తన యింటికి పిల్చేది భవాని. రచనని యిరవై నాలుగ్గంటలూ యింట్లోనే వుంచేది. కథ అడ్డం తిరిగి తన ప్లాన్ బెడిసికొట్టి తనకే ముప్పుతెచ్చి పెడ్తుందని, తాను తీసిన గోతిలో తనే పడ్తుందని కొంచెం కూడా వూహించలేకపోయింది. తన వేలితో తన కన్నే పొడుచుకున్నట్టుగా అయింది ఇప్పుడు ఆమె పరిస్థితి. భవాని గొంతుచించుకుని గోలపెట్టినా ఫలితం లేకపోయింది.

ప్రసాద్ మాత్రం చాలా సంతోషంగా వున్నాడు. ఆఖరికి ప్రసాద్, భవానిలు కోర్టుముఖంగా విడాకులు తీసుకున్నారు. అంతలా ప్రేమించి పెళ్లిచేసుకున్న భవానికి విడాకులు ఇస్తున్నందుకు ప్రసాద్ ముఖంలో విచారమే కనబడలేదు. ప్రేమకోసం జీవితాన్నే త్యాగం చేసినవాళ్లు వున్నారు. ప్రేమకోసం ప్రాణాలు తీసేవాళ్లూ వున్నారు. తీసుకున్నవాళ్లూ వున్నారు.

ప్రేమించిన దానికోసం జీవితం అంధకారమయం చేసుకునే దేవదాసులూ వున్నారు. కాని ప్రసాద్‌లాంటి వాళ్లు వుండడం చాలా అరుదు అనుకున్నారు తెల్సినవాళ్లు. ప్రేమ ఎన్నిరకాలో ప్రేమించే వ్యక్తుల మనస్తత్వాలు అన్నిరకాలు.

భవాని ఏడ్చి, మొత్తుకుని ఆఖరికి శూన్యమైన హృదయంతో పుట్టింటికి వెళ్లిపోయింది!

ప్రసాద్, రచనలు పెళ్లిచేసుకుని గాజువాకలో వేరే ఇల్లు తీసుకుని వెళ్లిపోయేరు.

★